# రససిద్ధి

## నిడదవోలు మాలతి.

రాజారావుకి ఆరోజు చిరాగ్గా తెల్లవారింది.
అప్పటికి ఇరవైరోజులక్రితం మామూలుగా తెల్లవారిన ఓ ఉదయం కాలేజీలో మామూలుగా పొద్దు పోలేదు. ఓ కుర్ర లెక్చరరుకీ తనకీ ఘర్షణ జరిగింది. అసలు సంగతి ఎవరికీ అంతుబట్టలేదు కానీ పిల్లలంతా పొలో మంటూ వీధిన పడ్డారు.
సమ్మె ప్రారంభమయింది. పిల్లలందరూ పుస్తకాలు మూలన పడేసి ఖాకాలు, బానర్లు పట్టుకుని తిరగడం మొదలుపెట్టారు. ఎక్కడ చూసినా "డౌన్, డౌన్, నిరంకుశత్వం నశించాలి, కామేశ్వర్రావుని తొలగించాలి, విద్యార్థుల న్యాయమైన కోర్కెను మన్నించాలి....గా వుంది వ్యవహారం.
విద్యార్థులలో ఉద్రిక్తత హెచ్చుగానే వున్నా పరిస్థితి ప్రశాంతంగానే వుందని అభిజ్ఞవర్గాలు అభిప్రాయ పడుతున్నారు. ఇది లోపల్లోపల ఉడుకుతున్న లావా కాదనీ, టైమిస్తే చల్లారిపోయే చితుకులమంట అనీ చూస్తూ ఊరుకున్నారు అధిష్ఠాన వర్గంవారు.
సమ్మెకారణం చాలామందికి తెలీదు. తెలిసినకొద్దిమందీ పదిరోజులయేసరికి మర్చిపోయేరు.
ఊరేగింపులూ, నిరసనప్రదర్శనలూ నీరు గారిపోయేయి.
చాలామంది వాళ్ల వాళ్ల వూళ్లకెళ్లిపోయేరు.
ఉన్నవాళ్లు పేకాటల్లోకీ పచ్చీసుల్లోకీ దిగేరు.
ఎవరు ఎవరికెదురుపడినా "ఎందుకొచ్చిన సంత" అన్న మొహాల్తో ముభావంగానే ప్రశ్నించుకుంటు న్నారు. తెల్లార్తే ఎలా పొద్దు పోతుందన్న ప్రశ్న ప్రతివాడి మొహంలోనూ అచ్చు గుద్దినట్టు అవుపిస్తోంది.
రాజారావు చిరాగ్గా లేచాడు. న్యూస్‌పేపరుతోనూ ట్రాన్సిస్టరుతోనూ మధ్యాన్నం వరకూ లాక్కొచ్చినా ఆ పైన కాలం మొండికేసి కదలడం మానేసింది. మ్యాట్నీకి పోదాం అన్నా అప్పటికే ఉన్నవన్నీ రెండేస్సార్లు చూడ్డం అయిపోయింది. రామకృష్ణ రూమ్ కెళ్తే రమ్మీ ఆడొచ్చు. అది ఊరుకా చివర్నుంది. కానియ్. కాలం గడవడమే కదా కావలిసింది. బ్రిడ్జిమీదుగా నడిచివెళ్తే అది కొంత కలిసివస్తుంది.
ఈ వూళ్లో బ్రిడ్జి పడిన తరవాత చాలామంది కుర్రకారుకి అదే పార్కూ, బీచీ, నాటకం, టౌనుహాలూ అన్నీ అయిపోయింది. ఇటు జార్జిపేట, అటు రామనగరు, పాతూరునించి నడిచిరావడం, బ్రిడ్జి నడిబొడ్డున నిలబడి వచ్చేపోయే జనాన్ని, జనానానీ చూస్తూ, వీలయితే ఈలలేస్తూ, అలా ఈలలేసినందుకు చీవాట్లు తింటూ, కాలినడకన పోయే చరిత్రహీనులని హేళన చేస్తూ తమ కాలక్షేపం జరుపుకోడం మామూలయిపోయింది.

ఈమధ్యనే అలా నిలబడడం కూడా బోరుగానే ఉంటోంది. దానికి కారణం ఆడపిల్లలకాలేజీ వూరికి దూరంగా కట్టేసి, ఆ పక్కనే ఓ పెద్ద హాస్టలుకూడా కట్టేయడం, వూళ్లో వున్న సాధేతీన్ సారసాఖుల కోసం బస్సులు నడపడంతో ఓవర్‌బ్రిడ్జి అమావాస్యముందు ద్వాదశి చంద్రుడిలా ఒకటి రెండు కళలతో వెలవెల బోతూంది.

రాజారావు ఆలోచిస్తూ రామకృష్ణ రూముకి చేరుకున్నాడు. అతను లేడు. టైము చూస్తే మూడయింది. వెనుతిరిగి గంటస్థంభం దగ్గిరికొచ్చేసరికి కాఫీ తాగుదాం అనిపించింది. అలాగయినా ఓ పావుగంట గడుస్తుంది కదా అని కాఫీ తాగి, ఓ సిగరెట్టు వెలిగించి నాలుగురోడ్ల కూడలిలో నిలబడి మళ్లీ ఎటు వెళ్లడమా అని ఆలోచిస్తుంటే జనార్దనం జ్ఞాపకం వచ్చేడు. తమ వూరివాడే. కొత్తగా కాలేజీలో చేరాడు. కాని పాతూరు వెళ్లాలి. కానియ్ చూదాం అనుకుంటూ అటు తిరిగి నడక సాగించేడు. జనార్దనం రూం చేరేసరికి నాలుగయింది. అతనూ లేడు.

"సినివారాలు చేస్తున్నాడు కదండీ. టికెట్టు దొరకదేమోనని ముందే వెళ్లిపోయాడు," అన్నాడు అతని రూమ్మేటు.

"సినివారం ఏమిటి?" అడిగేడు రాజారావు. తనకి తెలీని కాలేజీ వ్రతాలు కూడా వున్నందుకు రవంత అక్కజపడుతూ.

"కొత్తగా ప్రారంభించాంలెండి. కాలేజీలో అడుగుపెడుతూనే ఈ వ్రతం పట్టిస్తాం. దీనిప్రకారం సోమవారంనించీ శనివారం వరకూ క్రమం తప్పకుండా రోజుకొక సినిమా – ముఖ్యంగా కొత్త రిలీజు తప్పనిసరిగా చూడడం– ఆదివారం మెట్నీతో మూడాటలూ చూసిఉద్యాపన చేసుకోడం. ఆ తరవాత తాను ఏ అభిమానసంఘంలో చేరతాడో నిర్ణయించుకొని యథాశక్తి మూడో అయిదో టిక్కెట్లు పెట్టి ఆ సంఘసభ్యులకి వాయనాలు ఇచ్చుకుంటాడు. దీనికే కలియుగంలో సినివారవ్రతమని పేరు," అన్నాడు తొల్లి నారదులవారి హావభావాలననుకరిస్తూ.

రాజారావు తన జూనియర్ల తెలివితేటలకి అప్రతిభుడై, అక్కడ్నుంచి బయట పడ్డాడు. మరికొంతసేపు అలా తిరిగి తిరిగి రెల్వేస్టేషను చేరుకున్నాడు. బెంగుళూరునించి వచ్చేవాళ్లూ బెంగుళూరుకి వెళ్లేవాళ్లూ వెళ్లిపోయేసరికి, వాచీ చూసుకుంటే ఇంకా ఆరున్నరే అయింది. అవతల లైనులో గుడ్సుబండి ఆంధ్ర నాయకుల్లా ముందుకీ వెనక్కీ వూగుతోంది కాని స్టేషను వదిలే సూచనల్లేవు. ప్లాట్‌ఫారం అతని ఆశయాల్లాగే బోసిగా వుంది.

ఇప్పుడేంచేయాలో తెలీడం లేదు.

ఇదే అమెరికాలో అయితే హిప్పీలవుతారు అనుకున్నాడు.

బ్రిటన్‌లో అయితే తోటపనో పాకీపనో మొదలెడతారు కాబోలు.

కొరియాలోనో చైనాలోనో అయితే కత్తుల్నూరుకుంటూనో తుపాకులు తుడుచుకుంటూనో ఉంటారు కాబోలు.

భారతదేశవు జాతీయ పక్షి నెమలి.

జాతీయ మృగం సింహం.

జాతీయ క్రీడ హాకీ

జాతీయ కాలక్షేపం...?

దిక్కులు చూస్తున్న రాజారావుకి ఎక్కడుంచో సుస్వరగానం వినిపించింది.
మునిసిపల్ స్కూల్ ఆవరణలో కచేరి జరుగుతోంది.
రాజారావు అటువేపు నడక సాగించేడు.
విశాఖలోనూ, మద్రాసులోనూ, పదిహేనూ, ఇరవై, నూరూ, నూటయాభై రూపాయలకి టిక్కెట్లతో అమ్మజూపే సంగీతం రాయలసీమలో ఉచితంగా పంచిపెట్టబడుతోంది.
రాజారావు సంగీతజ్ఞుడు కాడు.
సంగీతప్రియుడూ కాడు.
కనీసం సంగీతాభిమాని కూడా కాడు.
ఆ ఆవరణలో అడుగుపెడుతున్నపుడు అతడి అభిప్రాయం ఒక్కటే - ఇంతమంది జనం ఇలా ఇక్కడ పోగయేరు కదా, వీళ్లందరికీ నిజంగా సంగీతంలో సారస్యం తెలిసే వచ్చేరా?
నాలాగే కాలం గడవక దిగడ్డారా?
మరో ఫ్రెండో, తల్లో, చెల్లెలో లాక్కొస్తే వచ్చేరా?
పాడేమనిషిని చూద్దాం అని వొచ్చేరా?
రాజారావు ఓవారగా నిలబడి కొత్తగా ఉద్యోగంలో చేరిన జర్నలిస్టులా జనాన్ని పరిశీలించసాగాడు.
చాలా రోజులుగా కనపడనివాళ్లూ, ఆడవాళ్లూ, వాళ్లతో వాళ్లతాలూకు పిల్లలూ, కాలేజీ గరల్స్, కాలేజీ బాయ్స్, పెద్దవాళ్లూ, చిన్నవాళ్లూ, అరవ్వాళ్లూ, సింధీవాళ్లూ, వార్తాపత్రికలవాళ్లూ, వర్తక శ్రేష్ఠులూ, చదువురానివాళ్లూ, చదివే వుద్దేశం లేనివాళ్లూ, సదా సినిమాలకెళ్లేవాళ్లూ, ఎప్పుడూ సినిమాలకెళ్లనివాళ్లూ, వీళ్లంతా నిజంగా సంగీతం కోసం వచ్చేరా లేక హరికథ అనుకుని పొరబడ్డారా?
తలలు మాత్రం గంగడోలులా వూపుతున్నారు.
"ప్చ"
రాజారావు ఉలిక్కిపడ్డాడు. తనచెవి దగ్గిర "ప్చ"రించిన అమ్మాయి అతన్ని దూసుకుని ముందుకెళ్లి ఆపక్కనున్నఅమ్మాయిని అడుగుతోంది, "ఇదేనా మొదలు?"
కాదంటే ముందు ఏం పాడిందని అడిగింది.
రంగంమీద జానెడు జరీఅంచున్న ఎరుపు పట్టుచీరె కట్టుకుని కంచి కామాక్షిదేవిలా ఆసీనురాలయి వున్నగాయకురాలి మొహం ఫొటోజెనిక్‌గానే వుంది.
తాంబూలమో లిప్‌స్టిక్కో స్పష్టంగా తెలీడంలేదుగాని సగంచాలు అనిపిస్తోంది.
తాళం వేస్తున్న చేతిమీద వజ్రంకాబోలు ధగధగ మెరుస్తోంది. కుడివేపు కూచున్నమృదంగవాద్యగాడు మరీ కుర్రకారులా వున్నాడు. ఆవాయింపులతోపాటు నిప్పులమీద కూచున్నట్టు మెలికలు తిరిగిపోతున్నాడు. కాని మొహమ్మీద చిర్నవ్వు చెక్కుచెదరలేదు.
అలా దరహాసంతో వాయించాలని రూలు కాబోలు.
మధ్యమధ్య ఆవిడ కూడా అతనివేపు చూసి అప్రూవింగ్‌గా తలూపుతోంది.
ఎడమవేపున్న బట్టతలమనిషి వాయులీన విద్వాంసుడిలా కాక ఏ కుందేలుపిల్లనో చిత్రహింస చేస్తున్న భల్లూకంలా అవుపిస్తున్నాడు. కమానుతో తన భూభాగాన్ని పరిరక్షించుకుంటున్న సైనికుడిలా విజృంభిస్తున్నాడు.

అతను ఎడమవేపు కాక కుడివేపు కూచుని వుంటే ఎలా ఉంటుందో? అసలు అతను తెరవెనక కూచుని వాయించవచ్చునే! కాని ఆ గాయనీమణి మటుకు మృదంగిస్టువేపు చూచినంత ప్రసన్నంగానూ వైలనిస్టువేపు కూడా చూస్తోంది. వైలిన్ కుడా అంత బాగానూ వాయిస్తున్నాడో, ఆవిడ నిష్పాక్షికతని నిరూపించుకుంటోందో తెలుసుకోడం ఎలాగో తెలీడం లేదు.

ఆగాయని జుట్టుముడికీ, వైలిన్ బట్టతలకీ మధ్య నేనూ ఉన్నాను స్మీ అని గుర్తు చేస్తూ మొహం ముందుకి పెట్టి మోర్సింగ్ వాయిస్తున్న కుర్రాడు మరీ గింజపట్టని పింజెలాగున్నాడు.

నూరు కాండిల్‌వాట్ బల్బులు ఆరు పెట్టి చూసినా మీసాలు మొలిచిన ఛాయలు కనిపించవ్.

తనకి ఇరవై నడుస్తున్నా సరిగమలే తెలీవే. హాఫ్‌పాంటులో తిరిగే ఈ బాలుడికి మోర్సింగ్ ఎలా వచ్చివుంటుంది చెప్మా?

అదొక వింతగా వుంటుందని స్టేజిమీదకి ఎక్కించేయలేదుగదా!

పదిమందిలో కలవని కొందరూ, స్టేజికి దగ్గిరగా కూచుంటే గోల బాబూ అని కొందరూ చిన్న చిన్న గుంపులుగా అండమాన్ నికోబర్ దీవుల్లా దూరంగా కూచుని రాజకీయాలు చర్చించుకుంటున్నారు.

"ఏవిటో డల్‌గా... ఉంది," అంది ఓ పిల్ల ఆవారం నేర్చుకున్న రంగవల్లి ఇసకలో దిద్దుతూ.

"ఆవిడ ఇంకా ఫామ్‌లోకి రాలేదు," అంది మరో చిన్నది.

"కప్పనో కాక్రోచ్‌నో కోసినట్టు అదే పాట అన్ని సంవత్సరాలుగా పాడుతుంటే మెకానికల్ ప్రెసిషన్ ఎందుకు రాదూ?" అని ప్రశ్నిస్తోంది మరో చిన్నది జూవాలజీ లెక్చరరు కాబోలు.

"అబ్బ! మాటాడకు, గోల".

ఆకసురుకి రాజారావు తుళ్లిపడ్డాడు.

"శ్రీరఘుకులమందు బుట్టి... అయేవరకు ఎవరేనా కిక్కురుమంటే చంపేస్తాను," ఇంచుమించు నాయకురాలిలా కనిపించే నారీమణి ఆంక్ష వేసింది.

"ఈపాట అద్భుతంగా వుంటుంది. ఇది విని చూస్తాను," అనుకున్నాడు రాజారావు.

గుడ్స్‌బండి గుక్కపట్టి రెండు నిముషాలు కేకపెట్టి ఊసరవెల్లిలా సాగిపోయింది.

".. వీడర... ఆరామమందు... మునుల..." -- ఎంత శ్రద్ధగా విన్నా మాటలు స్పష్టంగా తెలియడంలేదు.

కుడివేపు గుంపులోంచి కిసుక్కుమని నవ్వులూ, గుప్పిళ్లతో ఇసక విసురుకుంటున్న కుర్రకుంకలూ, అల్లరిచెయ్యకండిరా వెధవల్లారా అంటూ ఓమోస్తరు పైస్థాయిలోనే అరుస్తున్న పెద్దవాళ్లూ...

రాజారావుకి అయోమయంగా వుంది.

నిజంగా తాను అర్థం చేసుకోలేకుండా ఉన్నాడా?

ఆవిడ హృద్యంగా పాడడంలేదా?

ఆవిడ "ఫామ్"లోకి వచ్చిందా? లేదా?

"శ్రీరఘుకులమందు" పూర్తి చేసి, తన ముందున్న కప్పులోది ఓమారు చప్పరించి ఆలాపన ప్రారంభించింది.

ఆ కప్పులోది మంచినీళ్లా? కాఫీనా?

"సురలు సేవించునది."

"ఏవిటీ? నిజంగానే?"
"నిజం"
"నీకెలా తెలుసు?"
"మాఅన్నయ్య చెప్పాడు. ఆవిడ స్టేజిమీద వుంచమని కార్యదర్శికి చెప్పిందట."
"పోనిద్దూ గొడవ. పాట వినడానికొచ్చేవా, ఆవిడ అలవాట్లు చర్చించడానికొచ్చేవా?"
"ఆహా. ఆ మాధురీమహిమ ఎలా కలిగిందో వివరిస్తున్నానంతే."
రాజారావు ప్రయత్నంమీద ఆసంభాషణనించి దృష్టి మళ్లించేడు. ముందువరసలో అధీనరేఖకి అటువేపున్న ఒక నడివయసావిడ ఇటున్న కొడుకుని ఉద్దేశించి "మోహనరాగం" అంది.
అలా అంతమందిలో తనని అలా పిలిచినందుకు ఆ అబ్బాయి మొహం ముడుచుకుని తలెగరేశాడు తనకి తెలుసులెమ్మన్నట్టు.
కమ్మెచ్చులో పెట్టి సాగదీసినట్టు చెస్ట్ ఎక్స్‌పేన్డర్‌తో ఎక్సర్‌సైజ్ చేసినట్టు ఆలాపన సాగిపోతూంది. మందరస్థాయిలో ప్రారంభించి పైస్థాయిల్లోకి విస్తరిస్తూ పోతుంటే ఎవరో చెయ్యి పట్టుకుని అలా అలా నడిపించుకు పోతున్నట్టుంది! వైలనిస్టు ఆవిణ్ణి అనుసరిస్తున్నట్టు కాక పోటీ పడుతున్నట్టు వాయించేస్తున్నాడు. ఆ సంగీతం వింటుంటే అతని మొహం అందంగా లేదన్న సంగతి గుర్తుకి రాదు.
"ఏవండీ! అది మోహనంవా? కల్యాణా?" అనడిగింది ఓ పదేళ్లపిల్ల రాజారావుని చొక్కా పట్టుకు లాగుతూ. ఆ పిల్ల అడుగుతున్నది రాగం గురించనీ, ఆ రెండూ రాగాల పేర్లనీ అతను గుర్తించేశాడు కాని తనకి సంగీతం సంగతి బొత్తిగా తెలీదని చెప్పడానికి చాలా అవస్థ పడాల్సి వొచ్చింది. ఆలాపన అయిపోయింది కాబోలు "ఎవరురా.." ఆవిడ ఎత్తుకుంది.
"నే చెప్పలే. అది మోహనమే" అంది ఆ పిల్లే మళ్లీ.
ఎప్పుడు ఎవరికి చెప్పిందో అతనికి అర్థంకాలేదు కాని మోహనరాగం ఇలా ఉంటుందని గుర్తు పెట్టుకోడానికి తంటాలు పడుతున్నాడు.
"ఎవరురా... నిను వినా.. గతీ.. ..మా... కు....."
పిల్లలగోల చాలామటుకు తగ్గిపోయింది. చాలామంది తాళం వేస్తూ తలలూపుతున్నారు.
"సవనరక్షక... ఆ... ఆఅ.. నిత్యోత్సవ...."
"మీరు తాళం తప్పు వేస్తున్నారండీ," అంది ఆ పిల్లే మళ్లీ.
రాజారావు గ్రహించనే లేదు తన వేళ్లు లయకనుగుణంగా కదుల్తున్నాయని. ఆపిల్లమీద కోపం వొచ్చింది. నువ్వు నాకేం చెప్పక్కర్లేదని కసురుకోబోయేడు.
ఆఅమ్మాయి అమాయకంగా పాపాయినవ్వుతో "ఆదితాళం వెయ్యాలండీ" అంది.
రాజారావుకూడా చిన్న నవ్వు నవ్వేసి, కొంచె ముందుకి వెళ్లి కూచున్నాడు. ఆ క్షణంలో అతను – శాస్త్రీయ సంగీతం ఎంత బాగుంటుందో, తనకి సంగీతం తెలిసిపోతూందో, ఆవిడ ఫామ్‌లోకి వచ్చేసిందో తర్కించడంలేదు.
ఎవరూ.... రా..దసా... దసగరిసా....
"అయితే అమ్మాయిని పురిటికి తీసుకురారన్నమాట"
"లేదండీ. మా అల్లుడు... .."

గాగగాగరిరిరగ... ఆ..
"అవేనా సంగతులంటే?"
"కాదండీ. కీర్తనలోని ఒక పదం తీసుకుని మళ్లీ మళ్లీ పాడుతుంది చూడండి. అదీ సంగతి. ఇది స్వరకల్పన."
"సంగతులింకే వుండవా?"
"వుంటాయి. అవి వుత్తరాల్లో రాసుకుంటారు."
రాజారావుకి చెడ్డకోపం వచ్చింది. "తల్లీ! మీరు సంగీతం వినడానికొచ్చేరా?" అని అడగబోయి, మానేసి, విసురుగా లేచి గబగబ ముందుకి వెళ్లి స్టేజికి ఓపక్కగా నిలబడ్డాడు.
"ఎవరురా..." అంటూ గాయని వదిలిన తరవాత వైలనిస్టు అందుకున్నాడు. ఆవిడ వేసిన స్వరాలు గుండెల్లో ధ్వనిస్తున్నాయి. అతనివేళ్లు పదాలు పలుకుతున్నాయి.
ఆగాయకురాలు ఎంత హృదయానికి హత్తుకునేట్టు పాడిందో! ఆ వైలనిస్టు అంతగొప్పగానూ వాయిస్తున్నాడో!
"రేయ్", ఆంజనేయులు ఎప్పుడొచ్చేడో పక్కనించి మోచేత్తో పొడిచి ఇకిలిస్తూ మొదటివరసలో కూచున్న కొత్త లెక్చరరు కామేశ్వర్రావుని చూపించేడు.
అతనికి ఆయన్ని గుర్తించడానికి క్షణం పట్టింది.
ఇరవైరోజులక్రితం బ్రిల్‌క్రీంజుత్తుతో, పాండ్స్‌క్రీం మొహంతో అమెరికన్‌బుష్‌షర్ట్‌తో టైతో రుసరుసలాడుతూ క్లాసు వదిలేసిన కామేశ్వర్రావుకీ-
చెదిరిన జుత్తుతో, నుదుట చిన్న విభూతిరేఖతో, రెండుసెజులు పెద్దగా తోచే జుబ్బాతో నేలమీద పద్మాసనం వేసుక్కూచున్న ఈ కామేశ్వర్రావుకీ పోలికే లేదు.
"మరో పట్టు పడదాంవేవిటి?" అన్నాడు ఆంజనేయులు కళ్లెగరేస్తూ.
"ఇక్కడా?" ఔచితిని గూర్చిన ఆలోచన వచ్చింది రాజారావుకి తొలిసారిగా.
వైలిన్, మృదంగం ఛాన్సులు అయిపోయాయి కాబోలు "ఎవరురా" అని గాయని మరోమారు ఎత్తుకుని ముగించింది.
రసజ్ఞులూ, కానివారూ కూడా చప్పట్లు కొట్టేశారు.
ఆంజనేయులు రాజారావు చెయ్యిపుచ్చుకు లాక్కుంటూ పోయి కొత్తమాష్టారి పక్కనే చతికిలబడ్డాడు.
ఆయన వాళ్లిద్దరి మొహాలూ ఓమారు చూసి మందహాసం చేశారు. అది మనోహరంగా వుంది.
"సంగీత జ్ఞానము .. భక్తి..."
"ఇదేం రాగం సార్", ఆంజనేయులు రాజారావుభుజమ్మీదుగా ఒంగి కామేశ్వర్రావుని ప్రశ్నించేడు.
"ధన్యాసి"
"ఓహో! ఏం తాళంవండీ?"
"ఆదితాళం. కాని తెలియకపోతే, వేయొద్దు."
"మరి మీరు వేస్తున్నారు కదండీ"
రాజారావు విసుగ్గా, "ఒరేయ్! నువ్వు నోరు మూసుకుని కూచో. లేకపోతే, వెళ్లిపో" అన్నాడు.

ఆంజనేయులు తలూపుతూ తాళం వెయ్యడం మొదలెట్టాడు.
"భృంగనటేశ సమీరజ..."
ఈసారి కామేశ్వర్రావే ఆంజనేయుల్ని పిలిచాడు.
ఆయన నెమ్మదిగా, మర్యాదగా చెప్పారు, "కావలిస్తే నేను కూడా తాళం వెయ్యడం మానేస్తాను. నువ్వు తప్పులేస్తే పాడేవారికి కష్టం."
రాజారావు ఆంజనేయుల్ని పొమ్మన్నాడు. ఆ సతాయింపులు భరించలేక లేచి వెళ్లిపోయాడు అతను.
"న్యాయాన్యాయములు... తెలుసును..."
తనకు తెలియకుండానే పదం హృదయాన్ని తాకుతోంది. అతని హృదయం తదనుగుణంగా స్పందిస్తోంది.
"....షడ్రిపుల జయించే...."
ఆకీర్తన పూర్తయేసరికి అతనికి గుండెల్లో పట్టినట్టయింది. ఆ తరవాత ఆవిడ కొన్ని మీరాభజనలూ, ఓ జావళీ పాడి కచేరీ ముగించేసింది.
రాజారావు టైం చూసుకున్నాడు. పదకొండయింది. సాపాసాలు పాడే సభలో తానింతసేపు కూచోగలడని ఎవరేనా పందెం వేసినా తాను నమ్మి వుండేవాడు కాదు.
"మంచి విద్వత్ ఉంది." రాజారావు అటు చూశాడు. కామేశ్వర్రావు తనపక్కనే నడుస్తున్నాడు.
"ఏంటండీ?"
"మంచికళ వుంది ఆవిడ దగ్గిర."
రాజారావుకి కళ ఏమిటో, విద్వత్ ఏమిటో తెలీలేదు. ఇందాకట్నుంచీ తనని వేధిస్తున్న ప్రశ్న వేరే వుంది. ఆఖరికి తెగించి అడిగేశాడు.
"పాట పాడేవాళ్లు ఎందుకండీ మొహం అలా వికృతంగా పెడతారు?"
కామేశ్వర్రావు చిన్నగా నవ్వేడు. "ఆవిడ మొహం ఎలా పెట్టినా నువ్వింతసేపు కూచోగలిగావు కదా! సంగీతానికి అనుభూతి ప్రధానం. అనుభూతిప్రకటనలో ముఖం ఒక అంగం. గాయకులేదో విపరీతమైన అంగవిన్యాసం చేస్తున్నారని మనం అనుకుంటాం కాని అది వాళ్ల రసానుభూతికి, భావప్రకటనకీ అనుగుణంగానే ఉంటుంది. అంతెందుకు? పెదిమలు మాత్రమే కదిలిస్తూ నాలుగు వాక్యాలు చెప్పడానికి ప్రయత్నించు. అతిసాధారణమైన సంభాషణ చేస్తున్నపుడు కూడా మనం కళ్లూ చేతులు తిప్పుతాంగదా. నాభిహృత్కంఠరసననాసాది స్థాయీభేధాలతో, ద్వాదశ స్మృతిభేధాలతో నాదం వెలువడాలంటే ఎంత కృషి కావాలి. కొందరు అతి చేస్తారనుకో. కాని ఈ అతి చేయడం ఒక్క గాయకులకే అన్వయించి హేళన చేయడం అనవసరం.
శాస్త్రరీత్యా కొన్ని నియమాలున్నమాట నిజమే. శ్రోతలదృష్టిని గానం నించి మళ్లించే ఏచేష్టగానీ నిషిద్ధమే! అలాగే శిష్యప్రశిష్యులు ప్రచారం చెయ్యవలసిన స్వీయరచనలు సభలలో గానం చేయడం కూడా అనౌచిత్యమేనంటారు. కాని ఇటువంటి నియమాలు ఎవరు పాటిస్తున్నారిప్పుడు? శాస్త్రబద్ధమైన సంగీతం కన్నా సినిమాసంగీతమే చాలామందికి నచ్చుతున్న ఈరోజుల్లో ఓమోస్తరు అభిరుచి ఉన్నవాళ్లు ఓగుప్పెడు స్వరకల్పనలతో, చీమతలకాయంత ఆలాపనలతో ఏ సినిమాల్లోనో చొప్పించే త్యాగరాజకీర్తనలతో సరిపుచ్చుకునేవారే చాలామంది. అంతే. ఇలాటి సభల్లో కూచుని శ్రద్ధగా విన

ేవారేరీ. ఇవాళ ఇంతమంది వచ్చారుకదా అనకు. వాళ్లలో ఎంతమందికి ఎంతసేపు ఆమధురగానం మీద దృష్టి అన్నది ప్రశ్న".

"అరె", రాజారావు ఆగడంతో కామేశ్వర్రావు కూడా ఆగాడు.

"మాటల్లో పడి చాలా దూరం వచ్చేశాంవండీ. నేను వెనక్కి వెళ్తాను."

"అలాగా. నేనూ గమనించలేదు. సరే. వెళ్లు. చూడు. చిన్నమాట. మీరూమ్మేటు ఆంజనేయులికి మేగ్నటిజం టెక్స్ట్బుక్కిచ్చేను. అది రేపు తెచ్చి ఇచ్చేయమని చెప్తావా?"

"అలాగేనండీ. రేపు క్లాసుకి తెమ్మని చెప్తాను," అన్నాడు. మరుక్షణంలో రాజారావుకి తానన్నదేమిటో అనేసింతరవాత తెలిసింది. ఆమాటే ఆయనా అడిగారు. "రేపు క్లాసంటున్నావు. సమ్మె విరమించేరా?"

"ఆ!" అన్నాడతను త్వరత్వరగా అడుగులేస్తూ.

కామేశ్వర్రావు అతనివేపు రెండుక్షణాలు చూసి తన ఇంటివేపు నడకసాగించేరు.

తారాస్థాయి నిద్రలో వున్న ఆంజనేయుల్ని లేపి, "ఒరేయ్. ఈస్ట్రయికులూ గట్రా నాకు నచ్చలేదు. రేపట్నుంచి కాలేజీకి పోదాం," అన్నాడు.

"ఓర్నాయనా! నీకోసమే మేం అందరం సమ్మె మొదలెట్టాం. ఇప్పుడాయన క్షమాపణ ఇచ్చుకున్నాడా? నువ్వు మందు పుచ్చుకున్నావా?", ఆంజనేయులు మంచంమధ్యన పద్మాసనం వేసి ప్రశ్నించేడు.

రాజారావు లుంగీ చుట్టుకుని మంచంమీద వాలిపోతూ, "ఈరోజు రాజావారు కులాసాగా వున్నారు. అంచేత మనమే వారిని మన్నించేశాం," అన్నాడు గోడ వేపు తిరిగి నిద్రకొరుగుతూ.

*   *   *

(రచయిత్రి మనవి: ఇది 7/13/1973 లో ఆంధ్రజ్యోతిలో ప్రచురితం. నాకు సంగీతజ్ఞానం అస్సలు లేదు. తిరపతిలో ఉన్న రోజుల్లో స్నేహితులు ఈడ్చుకెళ్తే వాళ్లతోపాటు కచేరీలకెళ్లి ఆనందించేను. అక్కడ విన్ననాలుగుమాటలూ పుచ్చుకు ఈకథ రాసాను. అంచేత సంగీతం గురించి ఇందులో వున్న విషయంలో తప్పులన్నీ నావేగా భావించి సరదాగా కథ చదువుకోమని పాఠకులకి నామనవి!)